# చెరువు నిండింది

ఆకాశపుటంచుల్లోకి సూర్యుడు దిగజారిపోయాడు. మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికి సానివాడలోని రోడ్లు బురద బురదగా ఉన్నాయి. పొలాల నుంచి తిరిగి వస్తున్న పశువుల మందలు రోడ్లను మరింత రొచ్చు చేసి పోతున్నాయి. తనువుల్ని అమ్ముకొని మనుగడ సాగించే అభాగినులు - అలంకరణలు మొదలు పెట్టారు. అక్కడక్కడా ఉన్న వీధి దీపాల చుట్టూ పురుగులు అవిరామంగా ఎగురుతున్నాయి.

గదిలో పందిరి మంచం మీద, మోకాళ్ళ మీద తల ఆనించి కూర్చుని సావిత్రి ఆలోచిస్తోంది. భవిష్యత్తులోకి మనస్సు అయోమయంగా పయనిస్తోంది. తన జీవితం ఏ అగమ్య మార్గాల గుండా వెళ్ళుతుందో? ఇంకొక్క రెండు రోజుల్లో ఏడాదీ పూర్తయి, తనకు

కన్నెరికం చేసిన పెద్ద రాయుడి నుండి స్వేచ్ఛ లభిస్తుంది. ఇంక రామరత్నం తనని నిద్ర పోనివ్వదు. తనని మరో చెర లోనికి లాగుతుంది. ఎందరు మనుషులు తన జీవితంలో ప్రవేశించి ఎలా మలుపులు తిప్పుతారో?

'వెర్రిదానా! ఈ జీవితంలో మలుపనేది లేదు. చచ్చేవరకూ నీ జీవితం ఒక్కలాగే ఉంటుంది!' సావిత్రి మనసు ఘోషించింది.

తల్లిదండ్రులు లేని తనని, పెంచి పెద్ద చేశానంటుంది రామరత్నం. పేదరికాన్ని అనుభవించలేక, తనని చిన్నప్పుడే తల్లిదండ్రులు రామరత్నానికి అమ్మేశారని సావిత్రి నమ్మకం. ఏది ఏమైనా తను జీవితాంతం రామరత్నానికి కృతజ్ఞతగా ఉండాలి. అంటే తనకీ జీవితం తప్పదు. ఒక్క నిట్టూర్పు విడిచి, సావిత్రి మంచం దిగి ముందు గదిలోకి వచ్చింది.

"వెధవ రోడ్లు ఎప్పుడు బాగుపడతాయో ఏమిటో?" అంటూ రామరత్నం బయటి నుంచి లోపలికి వచ్చింది.

"మన జీవితాల్లాగే, అవీ అలానే ఉంటాయి!" అంది సావిత్రి నిర్లిప్తంగా.

"నువ్వూ, నీ చాదస్తమూను! మన జీవితాలకేం? హాయిగా ఉన్నాయి. అయినా, అదృష్టమంటే నీది - ఇప్పుడే భూపతిరాజుగారింటి నుంచి తిరిగి వస్తున్నాను" రామరత్నం ముసిముసి నవ్వులు నవ్వుతూ అంది.

"అంటే, ఆ ప్రెసిడెంటుగారా?! ఆయనతో నీకేం పని?" సావిత్రి కటువుగా ప్రశ్నించింది. రామరత్నం ఒక్కక్షణం తెల్లబోయింది. వెంటనే తమాయించుకొని అంది: "వయసుడిగిన ఈ రామరత్నం రోజులు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఇప్పుడు ఎవరికి నాతో ఏం పని వచ్చినా, అది నీ గురించే!"

"అంటే?..." సావిత్రి అయోమయంగా చూస్తూ ఉండిపోయింది.

రామరత్నం వీధి తలుపు గడియ వేసి, దగ్గరగా వచ్చింది.

"ఈ ఒక్క రాత్రికి అయిదు వందల రూపాయలు! రహదారి బంగాళాలో ఇంజనీరు గారు విడిది చేశారు. ఈ రాత్రి పదకొండు దాటిన తరువాత భూపతిరాజుగారి మనిషొకడు నిన్నక్కడకి తీసుకువెళతాడు. తూర్పు తెల్లవారకమునుపే నువ్వు తిరిగి వచ్చేద్దువు గాని" రామరత్నం ఆవేశంగా అంది, సావిత్రి మీద చేతులు వేస్తూ.

"నాలో ఏం చూసి ఆ ఇంజనీరు అయిదు వందలిస్తాడు?" సావిత్రి రామరత్నం చేతులు తీసివేస్తూ అంది.

"నీ అందం నీకేం తెలుసు? పెద్ద రాయుడి ఏడాదీ ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురు చూస్తున్న కుర్రవాళ్ళనడుగు - తెలుస్తుంది. అయినా, ఇవ్వవలసిన అయిదు వందలూ భూపతిగారప్పుడే ఇచ్చేశారు!" రామరత్నం గర్వంగా, జాకెట్లో దోపుకొన్న అయిదు వందల నోట్లను బయటకు తీస్తూ అన్నది.

"నువ్వేం చేశావో, ఆలోచించే చేశావా? పెద్ద రాయుడి బంధం ఇంకా రెండు రోజులుంది. మనం నియమాల్ని పాటించడం మంచిదనుకొంటాను. భూపతిరాజుగారికి వీలు పడదని కబురంపు" సావిత్రి గాభరాగా అంది.

"అదృష్టమనేది ఒక్కసారే తలుపు తడుతుంది, సావిత్రీ! నేనేం చేసినా, నీ మేలు కోసమే చేస్తాను. ఇంజనీరుగారి ప్రాపకం మనకి ముందు ముందు ఎంతైనా సహాయ పడుతుంది. పెద్ద మనుషులతో వ్యవహారమంటే నీ గిరాకీ పెరుగుతుంది. స్థాయి హెచ్చు తుంది. అయినా, ఆలోచించకుండా ఈ పని చేస్తానని ఎలా అనుకున్నావు? పెద్ద రాయుడికి కన్నెరికం ఒప్పందం ఇంకొక్క రెండు రోజులే ఉందన్న సంగతి జ్ఞాపకం ఉండి ఉండదు. లేకపోతే ఈ చివరి రెండు రోజులూ వదులుకుంటాడా? వారం రోజులై వెళ్లిన వాడు, ఈ పాటికి పట్నం నుంచి తిరిగి వచ్చేసేవాడు కదా? ఈ భయం చూపించే కదా, భూపతి రాజు నుంచి అయిదు వందలు తీసుకున్నది!"

రామరత్నం డబ్బుని బీరువాలో పెట్టి తాళం వేసింది. అంటే ఇంక రామరత్నం చేసిన నిశ్చయానికి తిరుగులేదన్నమాటే!

"సరేలే, నా ఖర్మ! రెండు రోజుల తరువాత నుంచీ జరగబోయే తతంగం ఈ రోజే మొదలైంది. ఇంజనీరు నాకేమైనా ముట్టచెపుతాడా?" సావిత్రి వ్యంగ్యంగా అంది.

"భూపతిరాజు ఇంజనీరు వద్ద నుంచి ఏ విధమైన బహుమానాలు ఆశించవద్దని ఖచ్చితంగా చెప్పాడు. వాళ్ళిద్దరికీ మధ్యను ఏవో లావాదేవీలున్నాయట. అయినా, నీ కిదో పరీక్షే అనుకో. నీ జాణతనం చూపించడానికిదే అవకాశం. దీపముండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి. తనంతగా తాను ఇస్తే మట్టుకు వద్దనడం...."

"భావ్యం కాదంటావు! అంతా అయిన తరువాత ముష్టి పది రూపాయలు మొహాన కొడితే నువ్వంటూన్న స్థాయీ, హోదా...?" సావిత్రి కర్కశంగా అంది.

రామరత్నం ఒక్క క్షణం మాట్లాడలేదు. సావిత్రి మాటల్లోని సత్యాన్ని గ్రహించ కలిగింది. చిరునవ్వు నవ్వుతూ, సావిత్రిని చూస్తూ అంది: "అందుకే నీ జాణతనం చూపించమన్నది. నువ్వు భూపతిరాజుకి కావలసిన మనిషిలా ప్రవర్తించగలిగితే, ఆ ఇంజనీరు డబ్బు సంగతి ఎత్తడు!"

సావిత్రి మరి మాట్లాడలేదు. మౌనంగా వెనక గదిలోకి దారి తీసింది. 'రాబోయే రోజుల భయంకర స్వప్నానికి ఈరోజే నాంది' అనుకుంటూ, మంచం మీద కూలబడి, మగతగా కన్ను మూసింది.

రామరత్నం వంట చేసి, సావిత్రిని లేపి భోజనం వడ్డించింది. భోజనాలయిన తరువాత దగ్గరుండి సావిత్రిని అలంకరించింది. రంభలా ఉన్నావంటూ బుగ్గలు గిల్లింది. పదకొండు దాటిన తరువాత భూపతిరాజు మనిషి వెనక గుమ్మం ద్వారా రామరత్నం ఇంట్లోకి వచ్చాడు. సావిత్రి ఓ శాలువా భుజాల మీదుగా ముసుగు వేసుకుని మౌనంగా భూపతిరాజు మనిషిని అనుసరించింది.

ఊరికి మైలు దూరంలో ఉన్న కాలువ గట్టు మీద ఉంది రహదారి బంగళా. కన్ను పొడిచినా కనిపించని చీకట్లో మిణుగురు పురుగులు మెరుస్తున్నాయి. భూపతిరాజు మనిషి టార్చిలైటు వెలిగిస్తూ, ఆర్పేస్తూ నెమ్మది నెమ్మదిగా నడుస్తున్నాడు. వెనకగా సావిత్రి అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూంది. చేలగట్ల మీద ఉన్న తాడిచెట్లు భూతాల్లాగా ఉన్నాయి. ఉన్నట్టుండి భూపతిరాజు మనిషన్నాడు - "జాగ్రత్తగా నడు! కింద పడితే బట్టలు పాడవుతాయి!" అని. సావిత్రి సమాధానం చెప్పలేదు. 'విప్పి పారేసే బట్టలు బురదైతే ఏంలే?' అని మనసులోనే అనుకుంది.

తుమ్మచెట్ల మధ్యనున్న రహదారి బంగళా ఆ చీకట్లో ఒక భయంకరమైన గోరీలా కనబడింది! 'పెద్ద మనుషులతో వ్యవహారం. జాగ్రత్తగా మసులుకో' రామరత్నం మాటలు చెవుల్లో గింగురుమంటూంటే, తడబడుతూన్న అడుగులతో రహదారి బంగళా మెట్లెక్కింది సావిత్రి.

ఇంజనీరున్న గదిని చూపించి, రహదారి బంగళా బంట్రోతు ఎటో వెళ్లిపోయాడు.

"తెల్లవారుఝామున నాలుగింటికల్లా వస్తాను" అని భూపతిరాజు మనిషి ఆ చీకట్లో కలిసి పోయాడు.

గది గుమ్మం దగ్గర సావిత్రి స్థాణువులా నిలబడిపోయింది. తలుపు సందుల్లోంచి నీలం వెలుతురు సన్నగా బయటకు వస్తూంది.

"కళ్ళు మూసుకుంటే ఈ మనుషులందరూ ఒక్కటే! డబ్బిచ్చి సుఖం కొనుక్కునే వాళ్ళ దగ్గర్నించి అనురాగమూ, ఆప్యాయతా ఆశించడం అవివేకమే అవుతుంది. ఈ సత్యం గ్రహిస్తేనే కాని సానిది వృత్తి సాగించలేదు!"- రామరత్నం భోజనం వడ్డిస్తున్నప్పుడన్న మాటలు మనసులో మెదులుతూండగా, సావిత్రి నెమ్మదిగా తలుపు తోసుకుని లోపలకు అడుగుపెట్టింది.

తూర్పున ఆకాశపుటంచులు తెల్లబడుతూంటే, సావిత్రి తిరిగి ఇంట్లో అడుగుపెట్టింది. సావిత్రి రాక కోసం కళ్ళలో వత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్న రామరత్నం, "ఏం సావిత్రీ, అంతా సవ్యంగా జరిగిందా?" అని ఆత్రంగా ప్రశ్నించింది.

సావిత్రి వేలినున్న ఓ బంగారపుటుంగరాన్ని తీసి రామరత్నం మీదకు గిరవాటు వేస్తూ అంది: "ఇంజనీరు తాగుడు మైకంలో నన్ను పెళ్ళి చేసుకుంటానని ఈ ఉంగరం వేలికి తొడిగాడు. నాలుగింటికి బయటకు వచ్చినప్పుడు, రహదారి బంగళా బంట్రోతు నా మీద చెయ్యి వేస్తే వాడి చెంప ఛెళ్ళుమనిపించి భూపతిరాజు మనిషి కోసం ఎదురు చూడకుండానే ఇంటి దారి పట్టాను. వాడు చేలగట్ల మీద నాకెదురుపడ్డాడు. అనుకోని విధంగా వాడు నన్ను బలాత్కరించాడు. వాడి దాహం తీరిన తరవాత కాని నన్ను వదల్లేదు! వాళ్లయ్యగారిచ్చిన అయిదు వందలకీ వాడు న్యాయం చేశాడుట. సరేలే, నా స్థాయి హెచ్చిందో, చచ్చిందో తరువాత ఆలోచిద్దువు కాని, ముందు ఇన్ని వేణ్ణీళ్ళు తగలెట్టు. అన్నట్టు, కొట్లు తెరవగానే ఓ బట్టల సబ్బు తెప్పించు. ఇదుగో, నువ్వు కట్టబెట్టిన కంజీవరం పట్టుచీర మట్టి కొట్టుకుపోయింది!"

సావిత్రి మీద కప్పుకున్న శాలువా తీసి, ఉండ చుట్టి మూలకు గిరవాటు వేసి, కట్టుకున్న చీర విప్పి రామరత్నం మొహాన కప్పి, తన గదిలోకి వెళ్లిపోయింది.

"ఏం పిల్లో, ఏమో?" అనుకుంటూ రామరత్నం కింద పడిన ఉంగరాన్ని తీసి బీరువాలో దాచి, బయటికి వెళ్ళి, నీళ్ళ పొయ్యి రాజేసింది.

పదింటికల్లా ఊరంతా చింతతోపు చెరువు దగ్గర గుమిగూడింది. చెరువులోకి దక్షిణాన ఉన్న తూములోంచి కాలువ నీరు ప్రవహిస్తూంది. మూడేళ్ళుగా చుక్క నీరు లేని ముప్పయి ఎకరాల చెరువు గట్లదాకా నిండుతోంది. చెరువుకి ఉత్తరాన ఉన్న మాలగూడెం వాళ్ళు ఆనందంగా డప్పులు వాయించడం మొదలుపెట్టారు. తూర్పు గట్టున గంగాలమ్మ గుడి మెట్ల మీద మీసం మెలి తిప్పుతూ భూపతిరాజు ప్రగల్భాలు కొడుతున్నాడు.

"ఇంజనీరు గారు చాలా దొడ్డ మనసు కలవాడయ్యా! పక్క ఊళ్ళ వాళ్లు పెట్టిన లంచాలు తిని, పాత ఇంజనీరుగారు మన ఊరికి చేసిన అన్యాయాన్ని చెవిలో ఇల్లు కట్టుకుని పోరాను. మన ఊరి కోసం- అంటే మీ కోసం నా అభిమానాన్ని పక్కకు నెట్టి, ఆయన దగ్గిర చేతులు జోడించానంటే నమ్మండి. మన ఊరు చల్లగా ఉండడమే నా ధ్యేయం!" అంటూ రాబోయే ఎలక్షన్లకి మళ్ళీ పునాది వేసుకుంటున్నాడు.

చెంపదెబ్బ తిన్న రహదారి బంగళా బంట్రోతు ఆ సాయంత్రం ఊరి నుంచి తిరిగి వచ్చిన పెద్ద రాయుడి చెవిలో సావిత్రి వ్యవహారం ఊదేశాడు. పెద్దరాయుడికి అహం దెబ్బతింది. ఇంకా గడువు వుండగానే సావిత్రి డబ్బు కోసం కక్కుర్తి పడిందని రాయుడి గుండెలో మంటలు చెలరేగాయి.

పెద్ద రాయుడి కబురందుకుని ఆ రాత్రి అలవాటు ప్రకారం సావిత్రి పెద్ద రాయుడి మామిడితోటలో ఉన్న పాకలోకి అడుగు పెట్టింది బెదురుగా. పాకలో అడుగు పెడుతూండ గానే సావిత్రి జుట్టు పట్టుకుని, ఆ చెంపా ఈ చెంపా వాయించాడు పెద్ద రాయుడు. ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టాడు.జరిగింది గ్రహించడానికి సావిత్రికి అట్టే సమయం పట్టలేదు. భూపతిరాజు తనని పావుగా వాడుకున్నాడు. కానీ, ఏది ఏమైతేనేం, తన వల్ల ఊరి చెరువు నిండింది! ఊరికి మేలు జరిగింది. ఆ సంతృప్తి సావిత్రికి ధైర్యాన్నిచ్చింది.

"ఇంట్లో రోగిష్టి పెళ్ళాన్ని పెట్టుకొని, నీ దాహం తీరడం కోసం నన్ను వాడుకున్నావు! ఊరికి మైలు దూరంలో కాలవ పెట్టుకుని, ఊరి వాళ్లందరూ దాహంతో చస్తూంటే, వాళ్ళ దాహం నేను తీర్చాను! ఏం, తప్పా?!" - రాయుడి పట్టు నుంచి విడిపించుకుని సావిత్రి ప్రశ్నించింది తీవ్రంగా. దెబ్బ తిన్న బెబ్బులిలా రెచ్చిపోయాడు పెద్ద రాయుడు. మరుక్షణంలో సావిత్రి గొంతు చుట్టూ రాయుడి చేతులు బిగిసిపోయాయి!

మరునాడు ఉదయం చింతతోపు చెరువులో గంగాలమ్మ గట్టు వైపు సావిత్రి శవం తేలింది. "శుభమా అంటూ మూడేళ్ళ తరవాత చెరువు నిండితే, ఈ ముండకి ఇదే చోటు దొరికిందీ చావడానికి!" అంటూ ఊరంతా ముక్కు మీద వేళ్ళేసుకుంది. నిజం ఏ కొద్ది మందికో తెలుసు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 24-11-1976)